# కన్నోళ్ళ సొత్తు కాకులపాలు!

"ఎప్పుడైనా సరే నోరట్లాజారి ఏందైనా ఒక మాటట్లా అంటే చాలు. ఓయబ్బా! అంటా నామింద యిర్సక పడ్తారు. ఎవురి కోసరం చెప్తావుండారో? ఎందుకోసరం అంటా వుండారో?... ఆ మాత్రం తెల్సుకోకుండా పోతే యింక యాడపాయ్ చచ్చేది? ఇంక కోపమా? దానికేం తక్కువలే. రమ్మంటే బండ్ల మిందొస్తింది. అయినా నాకెందుకులే? నేను వొగిటే ఈడ సీల్లు కొట్టుకోని ఉండ బొయ్యేటట్లుగా ఉండాది. లేకుండా బోతే కడుపు చించుకుంటే కాళ్లకాణ్ణే పడ్తిందని ఎంతని కడుపులో పెట్టుకోని యిట్లా మగ్గేది? అయ్యయ్యయ్యో! నా వల్ల కానే కాదమ్మా. మింగలేక కక్కలేక మినకరించి చచ్చేటట్లుగా ఉండాది.''

తెలిసిందే గదా మా బాశాలి కత. యాణ్ణో తేలాల అనుకుణ్ణిందంటే యాణ్ణో మునిగితింది. మునిగే దానికి మొదులు పెట్టింది. ఇంక యాడ పాయ్ తేల్తుందో చూద్దామని ఎదురు చూస్తావుండా!

ఈ ఎదురు చూసే పని వుండాదే? ఒక వొళ్లు అలిసే పనా? అసలుండదు. అయినా కాళ్లాడవు. చేతులాడవు. ఊరికేనే యాసిరి కొచ్చేస్తింది. అందుకే ఎదురు చూడాల్సి వచ్చిందంటే! 'పగోడికి కూడా వద్దురా ఈ బాద!' అనిపిస్తింది.

అట్టగాకుండా చటాపట్ అట్నో యిట్నో తేలిపోతే? మణుసు తేలికైపోతింది. అంత లేసుగా సలీసుగా యిడ్సిపెట్టేసే రకంగాదే మాబాశాలి. దెబ్బ ఎట్ట కొట్టాల్నో తెలుసు. యాడ కొట్టాల్నో తెలుసు. మల్లా ఎప్పుడు కొట్టాల్నో తెలుసు. అన్నీ తెలిసిన మణిసి గదా? కొట్టాల్సిన చోట్లో కొట్టేస్తింది. మల్లా ఏమీ ఎరగని నంగనాచి మాదిర వగస్తా ఉంటింది. తనదేం పాయ? దెబ్బ తిన్నోడు కద్దు. వాడి గాచ్చారం కద్దు. గొంతు పిసికి పారేసిన కోడి పిల్ల మాదిర్తో యిలా యిలా కొట్టుకుంటా వుంటే ఆపె కది ముద్దు!

లేకపోతే! చూడండేమే? ఘుస్తుగా కడుపులో పెట్టుకోని మగ్గి పోతా ఉండాదంట. కడుపు చించుకుంటే కాళ్ల కాణ్ణే పడ్తిందనీ మింగ లేక కక్క లేక మినకరించి చస్తా ఉండాదంట. అప్పిటికి కొంపలో ఉండేది ఆపె వొగిటే అయినట్టు- ఈ కొంప మూడారు దోవలై పోతా వుణ్ణా ఇంక ఎవురికీ చీమకుట్నెట్టయినా అనిపించనట్టు- ఆ యిల్లాలు మల్లగుల్లాలు పడిపోతా ఉండాదంట!

ఇది యాడైనా కద్దా? సంసారం అన్నాక ఆ బొరువు బాద్దెత వొద్దా? ఒక రిట్టా ఒకరట్టా గుంజులాడుకుంటా వుంటే ఆ బతుకు సాగేది యింకెట్టా?

కొంతమంది ఆడోళ్లకు అదొక కుశాల. మొగోడు యెంత చెమట తీసేసినా చతుర్లాడకుండా పోతే వాళ్లకు ముద్ద నోట్లోకి పోదు. ఎప్పుడో ఒక దినం. తల అట్టా వొంచినట్టు వొంచినారు. ఈ పొద్దు వడేసి పట్టుకుణ్ణారు. వాటం చూసుకోని వాయిస్తా ఉండారు. రోట్లో తలకాయిని దూర్చేసినాం. ఇంక రోకటి పోట్లకు యెరెస్తే ఏం కాబోతింది?

''బిడ్డకు పెళ్లయింది ఎప్పుడు? నిన్ననా? మొన్ననా? చూస్తా చూస్తా ఉండంగానే మూడేండ్లు అయ్‌పాయ. అప్పుడుగూడా అంతే గదా?- వాడెవుడో గొడ్డబోతు నాకొడుకు?' యిద్దో యిచ్చేస్తా. అద్దో ఇచ్చేస్తా. మద్దేణాని కొచ్చేస్తాది. మాపిటేల కొచ్చేస్తాది?' అని ఏడ్చే బిడ్డకు ఎలక్కాయ చూపించినట్టు ఆడిస్తా ఉంటే వాడి చుట్టా తిరిగేదానికే సరిపాయ. ఆ యదవను నమ్ముకుంటే తీరా ముంచుకోనొచ్చె. అప్పుడు ఆడా ఈడా కొంపలో ఉణ్ణింది బీజారుకొని పాయ్ ఆ అశారి చేతికిస్తే వాడేం చేసె? వొక్కా ముక్కలు చేసె. వాడు మాత్రం ఏమి చేస్తాడు? చేస్తావా చస్తావా? అని గొంతల మింద కూసుంటే! - సడేలే! వగాతగా రొండూలేని మొగోడు కొంపలో ఉంటే వక్కా ముక్కల బతుకు కాకుండా సక్కరంగా యాడుంటిందిలే?- అని సరిపెట్టుకుంటా ఉండంగానే బతుకట్టా సాగిపోతా ఉండాది. అయినా మిగిలిందో సగిలిందో తెచ్చుకొనే దానికి గూడా తీరుబాటు గాకుండాబోతే యింక నా చావు నేనేడ చదరం చేసుకోవాల?''

''కొంచిమో నంచిమో బంగారంటే బంగారేగదా? ఆ అశారోడి దగ్గిరికి పాయ్ దాన్నట్టా తీసుకొని రారాదా? అని ఒక్కమాట్లో చెప్తే సరిపొయ్యేదానికి వొగసేది... వార్సేది...చచ్చేది... బతికేది- ఎందుకే యిన్ని? ఇన్ని చెప్తేకానీ మణుసు నిమ్మతి పడదో?''

''ఎట్టెట్టా? మణుసు నిమ్మతా?... నిమ్మతి చేసుకోని ఉండంగానే బతుకీడికి ఉండాది. లేకుండాబోతే ఎప్పుడో యీదుల్లో పాయ్ పడేది.''

బుద్ధి గెడ్డి తినిందంటారే? ఎట్టంటే?- ఇదో యిట్టా. ఆపె య్యాష్ట పొయ్యేది. అరచేతికి అద్దం ఎందుకన్నట్టు అర్తం అవతానే ఉండ్లా. నోరు మూసుకోని ఎలబారి పోతే పోలా. పోతే అదెట్టా? బిచ్చం పెట్టే బొచ్చుముండా అనే కత గదా మనది!-

ఆడేణ్ణో ఒక ఊళ్లో ఒక అత్తంట. అత్తంటే అట్టా యిట్టా మాదిరి అత్తగాదు. కోళ్లను గెల్సిన కోడంట. ఆ అత్తకొక కోడాలు. ఆ కోడాలు కొత్తగా కాపురానికొచ్చిన దినాల్లో పొద్దెక్కేదాకా పొణుకోనుండేదంట. ఆ బిడ్డకూడా పాపం కావాలని పొణుకుంటిందా? తెల్లవాదులూ మొగుడితో ఏగులాడి చావుజంపులై పోతే పొలుమాలి పొణుకుంటింది. అది అత్తకు తెల్దా? తెల్సు. ఆ అత్తగూడా ఒక ఇంటి కోడాలే గదా? అయితే ఈ మాట అత్తలకు యాడ గ్యాపకం ఉంటిందిలే. అందుకని 'పొద్దెక్కే దాకా పడకేస్తే ఈడ పని ఎవుడు చేస్తాడే నీయమ్మా మొగుడు?' అంటా పొరక్కట్ట చేతికి తీసుకోని ఒక్కటి అంటించిందంట. ఆ దెబ్బతో గూడా కోడాలు ఎగిరి పడి లేచి పనీ పాటా చేసుకుణ్ణిందంట!

ఆపొద్దుటి నుంచి కోడాలు పడక మింద ఉండగానే అత్త ఒక్కటి ఇచ్చేది.

కోడాలు లేచి తన పని తాను చేసుకుండేది.

ఇట్టానే కొంత కాలం జరిగి పొయ్యింది.

ఇంక కోడాలు తనంతట తానే లేచి పని చేసుకుంటిందని అత్తకు నమ్మకం కుదిరింది. ఆ పొద్దు నిద్దర లేచి అత్త గమ్మునే ఉండి పొయ్యింది. కోడాలు అంతే! అప్పుడు అత్త కోడాలి దగ్గరికి నేరుగా పొయ్...

''ఏమే కోడాలా? ఎందుకు లెయ్ లేదే?'' అని అడిగితే-

''నాకిచ్చేది ఇచ్చేస్తే నేను లేస్తా!'' అనిందంట.

అట్టామాదిర రొండని నాలుగు అనిపించుకోకుండా బోతే మనకు కూలు కుదరదు. కాలు కదలదు. అనాల్సింది అనేసి ఇనాల్సింది ఇనేసి ఎలబార్తా ఉండా.

''జాగర్త! జాగర్త! ఆశార్లంటే అసాద్దెపు మణుసులు. ఈ కంటికి తెలవకుండా ఆ కంట్లో పాపను కత్తరించేస్తారు. కావాలంటే వాడి తల్లి తాళి బొట్టే ఇచ్చి చూడు. తరుగు తీసుకోకుండా బోతే నన్ను తరిమి తరిమి కొట్టు. లెక్కా పక్కా కరెట్టుగా చూసుకోని మనకు రావాల్సింది మనకు చాలు. జాగర్తగా రాబట్టుకోని రా. గురుగ్గింజంత బంగారుంటే ఏనిగి మింద కూసోని ఎదుటోణ్ణి సున్నం అడిగే దినాలివ్వి.''

''అదేందది అట్టంటా ఉండావే? మనం ఇచ్చింది ఎలక్కాయంత బంగారు గదా? గురిగ్గింజంతేనా? గోలీ గుండంత మిగిలుంటింది. దాన్ని తెచ్చుకుండే దంటే మాట్లా? 'జాతరకొచ్చిన దొంగలు ఇంకా ఊరొదిలి పోలా. మీ మీ జాగర్తలో మీరుండండి' అంటా తిరపతి పోలీసోళ్లు మైకుల్లో గొంతు చించుకుంటా ఉండారు. బందోబస్తు అదీ ఇదీ అన్నీ పకడ్బందీగా చేసుకొనే...'

నాలిక కొన దాకా వచ్చిన మాట ఎంత గుంజుకున్నా ఉహూ! బయట పడనంటా

ఉంటే నేనే బయటపడి నడస్తా ఉండా. అయితే కట్టె మాత్రమే ఈడ. కలవరం మిద్దూరు కాడ!...

ఎటుమంటి గొల్లోడికైనా యాపకాయంత ఎర్రి ఉంటింది అన్నెట్టుగా అది కుప్పకాట్లో ఆడదానికైనా కుప్పమింద కూసుండే ఆడదానికైనా బంగారంటే శానా మునాస. మరీ కొంతమందిని చూస్తా ఉంటే చింత కాపే సిగ్గు పడ్తింది. అపూటకు కూటికి లేకుండా పాయ్‌నా బాద పడరేమో గానీ... ముక్కులో కంత చెవులో కంత బంగారు లేకుండా బోతే 'ఎందుకబ్బా ఈ గిరిం సెన్ణె బతుకు?' అని శాపనెత్తి గెడ్డనేసినట్టు అల్లాడి పోతారు. అట్ట కాకుండా బోతే ఎద్దల గొట్టి ముద్దలు తినే ఆ పల్లె కొంపలో బంగారు పని చిన్నబ్బకు అడ ఏం పని ఉంటింది? కొంత మందికి వాళ్ల రూపమే వాళ్లకొక వరం. వాళ్ల మాట మణుసులో మెదిల్తే చాలు. వాళ్లు కంటెదట నిలబడుకున్నెట్టే ఉంటింది.

బంగారు పని చిన్నబ్బ అంతే! –

నిలువెత్తు మణిసి. నిమ్మపాండు రంగు. గిరజాల జుట్టు. ఇంక మీసాలా? కోడి కత్తులే అనుకో. అడ్డం కుంకం బొట్టు పెడ్తాడు. దాని పైన కంది పప్పంత కాటిక చుక్క పెడ్తాడు. ఎద మింద ఎట్లేదన్నా శాటెడు వడ్లు ఆర పొయ్యొచ్చు. ఒక్క చూపు చూసినాడంటే సటపటమైనోడు అయితే ఆ చూపుకు చుంగ్రడక పోవాల్సిందే!

లేకుండాపోతే అయిదు మంది ఆడోళ్లు ఆ మణిసి దగ్గిర తలొంచి తాళి కట్టించు కుంటారా?

అలనాడు ద్రోపదమ్మ అయిదు మందిని కట్టుకునిందంట. ఒక్కొక్కరితో ఒక్కొక్క సమ్మత్సరం ఒకరొకర్తో వంతుల పకారం కాపరం చేసేటట్టు మాట కట్టుకుణ్ణిందంట. ఈ పొద్దు వాడుండ్లా బంగారు పని చిన్నబ్బ అయిదుమందిని కట్టుకున్నాడు. ఆ అయిదు మందిని గుదిగట్టి గుడిసింట్లో పారేసి మొనగోడు ఏలుకుణ్ణాడు. ఒక్క దానితోనే ఏగ లేకుండా వొద్దురా తండ్రీ! అనుకుంటా ఉంటే అయిదు మందిని బరాయించిన చిన్నబ్బ ఎంత మొగలాయో మీరే ఆలోచించుకోండి.

బంగారు పని చిన్నబ్బ ఒక్క బంగారు పని చేసే దాంట్లోనే కాదు– కోళ్లకు కత్తులు కట్టే దాంట్లో బలే ఫలాతన్. కోడి పందాల కాడ నిలబడి మొనగోడు కోడి కత్తి మీసాలు వడేసి తిప్పుతా కోడికి కత్తి గట్టినాడంటే అదెటుమంటి కోడైనా ఏటుకొగిటి ఎగిరి పడాల్సిందే!

ఈది నాటకాల్లో వేషం కడ్తాడు. అది గూడా దుర్యోదనుడి వేషమే కడ్తాడు. వాడి పొసుగూల! వేషం ఏసుకోని అడుగు కడ్తా ఉంటే ఆడోళ్లకత చెప్పాల్సిందే పన్లే! వాళ్ల పని పైట సర్దుకుండే దానికే సరిపోతింది. అందుకే కొంత మంది మొగోళ్లు బంగారి పనోడు వేషం కడ్తా ఉండాడంటే ఆ ఆటకు హరిహర బెమ్మాదులొచ్చినా ఆడోళ్లను గడప దాటనీరే!

సరే! ఇంకా ఆపాయికట్లో ఏలికి ఉంగరం కావాలనుకుణ్ణా ఆలికి తాళిబొట్టు చెయ్యాలన్నా బంగారి పని చిన్నబ్బే గెతి!

అటుమంటి బంగారు పని చిన్నబ్బ ఒక నాడు తూరుపు పటం ఎగరక ముందే గుడిసింటి ముందర అయిదు మంది పెండ్లాలు పాడి పాడి యాడస్తా ఉంటే తాను కాళ్ల సందన తలకాయి పెట్టుకోని కూసోనుండాడు. ఊరెత్తక పొయ్యేటట్టు వాళ్లు యాడస్తా ఉంటే ఊరూ నాడూ వొగిట్లై పాయ!

ఇంతకూ ఏమయిందబ్బా అంటే?

చిన్నబ్బ ఇంట్లో దొంగలు పణ్ణారంట! దొంగలు పడిందానికి నిదర్శనంగా చిన్నబ్బ ఒంటి మింద ఆడంత ఈడంత గీసుకోని పొయ్యుండాది. గుడిసింటి గోడకు కన్నం పడుండాది! ఆడ చేరినోళ్లంతా అయ్యో పాపం! అంటే అయ్యో పాపం!! అన్నారు.

దొంగలు బడి దోచుకోని పోతే ఎవురు మాత్రం ఏం చేస్తార్లే అని సర్దు కుణ్ణారు. ఆదెబ్బతో బంగారి పని చిన్నబ్బ గూడా బాగానే సర్దు కుణ్ణాడు.

ఈ నాటకం బెమ్మాండంగా రగితి కట్టేకుందికి చిన్నబ్బ రొండేండ్లకో మూడేండ్లకో ఒకసారి ఈది నాటకం ఆడక పాయ్‌నా ఈ నాటకం ఆడేదానికి మొదులు పెట్నాడు.

మిద్దారు యిడ్సి పెట్టేసి శానా దినాలైపాయ గదా.

అయిదు మందిని కట్టుకోని గూడా చిన్నబ్బ అవసాన కాలంలో శానా ఇబ్బంది పణ్ణాడంట. యాళ కింత కాచి పోసే వాళ్లు లేరు. ఎత్తి పోసే దిక్కులేదు. చేసిన చేతలకు ఊరు గూడా చేర దీలేదు. గోరస్తా గోరస్తా చస్తే ఈడ్సి అట్టా పారేసి నారంట!

బతికినంత బతుకు బతికి కడాన కుక్క చావు చచ్చినాడు.

''ఎట్ట బతికినా ఎట్టెట్ట సంపాదించినా ఏముండాదిలే? ఏ పొద్దో ఒక నాటికి ఎలబారి పోతా ఉండాల్సిందే గదా. గురుగ్గింజంత బంగారు కోసరం గుమ్మిడి కాయంత బాద పడ్తా ఉండామే'' అనుకుంటా నాలుగ్గాళ్లమండపంకాడ పోతావుండా.

'ఓరబ్బయ్యా!... అబ్బయ్యా' అని ఎవురో ఎలుగిచ్చి నట్టుంటే నిలబడ్తి. అట్టా యిట్టా చూస్తి. రెండు బార్ల దూరాన ఒక ముసిల్ది!

ఎండి పొయ్‌న కట్టె. ఒక దుడ్డి కట్టె మింద వాలుకో నుండాది. అయినా ఆ చూపుల్లో చురుకుండాది. మొకంలో కళ ఉండాది. ఆ వయసులో కూడా మొకం నిండా పసుపు పూసుకుణ్ణింది. అర్ధ రూపాయి బిళ్లంత కుంకం బొట్టు పెట్టుకోనుండాది. తెల్ల బడి పొయ్‌న ఎంటికల్లో తావు దొరికినా మా తావు కనిపించకుండా పోతావుండాదే అని తల్లో మల్లె పూలు తల్లడిల్లి పోతా ఉండాయి.

అంతలోనే అడుగుమింద అడుగ్గా ఆ యవ్వ నా ముందిరి కొచ్చి నిలబడె!

''మిద్దింటోళ్ల అబ్బోడు గద నాయనా నువ్వు.''

'' అవునవ్వా! అవును. నువ్వు...''

''మీ ఊళ్లో బంగారి పని చిన్నబ్బ అయిదో పెండ్లాన్ని గదా? నువ్వు అప్పుడెంత ఉంటివి. ఏలిడంత పిలగాడు గదా నాయనా?''

''బంగారు పని చిన్నబ్బా...''

''చచ్చినా ఈ మణిసి ఇట్లుండాదేంది... అనుకుంటా ఉండావా? నువ్వే చెప్పు నాయనా ఆ యదవకు నేనెందుకు తెంచాల? అయిదు మందిని కట్టుకోని వాడు ఎవుర్ని సుకపెట్టినాడు? అయినా ఈ పసుపు కుంకం ఈ పూలు ఆ యదవ నాకీలేదే?''

తలకాయి దిమ్మ తిరిగి పోతా వుంటే తమాయించుకోని-

''చిన్నబ్బ సంపాదన చిన్న సంపాదన కాదే?'' అంటే -

''థూ! అదీ వొక సంపాదనేనా? అదీ వొక బతుకేనా? కన్నోళ్ల నోరు గొట్టి సంపాయించె. కడాన పోతా పోతా వాడెవుడో వొక యదవ పరం చేసి పాయ. వాడు చీట్లాటకు చిత్తూరికి తిరపతికి తిరిగి తిరిగి దారపోసె. కన్నోళ్ల సొత్తు కాకుల పాలే గదా నాయినా!''

ఎవరో పక పక నవ్వినట్లుంటే దిక్కులు చూస్తి. ముత్తారెడ్డన్న!

''ఒరే అబ్బోడా! అవ్వ పాత కాలం మణిసి. పాత కాలం మాట్లే మాట్లాడ్తా ఉండాది. ఈ పాత కాలం మాటలు చెల్లి పాయ్ శానా దినాలైపాయ. ఇప్పుడు కన్నోళ్ల సొత్తు తినగలిగినోళ్లే కలిగినోళ్లు. స్విస్ బాంకుల దాకా వద్దు. ఆ మాట కొస్తే గండిపేట కాడికి గూడా వద్దు. యాడేడో ఉండే కతలు మనకెందుకు? ఉండూరి కత చూడరాదా?'' అనె.

మా ఊళ్లో అట్లాంటివి శానా మిద్దెలు మేడలు కొసరుకు కార్లు వర్సగా వస్తా నన్ను ఎక్కిరిస్తా ఉంటే నేను బిక్కరించి చూస్తా ఉండా! ●